# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

యాపచెట్టు తొర్రలో వొదిగిన చిలకలు రెపరెపమని పైకి లేచినాయి.

ముందుకు తూలి ఉలిక్కిపడి కండ్లు తెరిచింది గుడిసింటి దీపం.

అది చూసి దీపాలన్నీ పకపకా నవ్వినాయి.

''రెప్పపాటులో ఏం నిద్దరొచ్చిందమ్మా! నాలుగుపుట్ల నిద్దర్ని నెత్తికెత్తుకున్నట్టు వున్నింది'' అనింది కండ్లు నలుపుకుంటా.

## గొర్రెల తాత



''నిద్దరచోటు ఎరగదు. ఆకలి రుచి ఎరగదు. కామం భయమూ, లజ్జా ఎరగదు'' అనింది మిద్దింటి దీపం.

''గాలీవానని ఆపగలమా? కష్టమో, సుఖమో అనుబోగించాలిగాని! కొంతమంది నీతులు చెప్పేదానికే పుడతారు. కొంతమంది నేతులు తాగేదానికే పుడతారు. కొంతమంది కష్టంచేసేదానికే పుడతారు గొర్రెలతాత మాదిరి'' అనింది పెద్దింటి దీపం.

''నీతులు చెప్పేవాళ్ళు, నేతులు తాగేవాళ్ళు మనకెందుకు? గొర్రెలతాత గురించి చెప్పు విందాం?'' అని అడిగింది కప్పూరదీపం.

''పనిలో పరమాత్ముడ్ని వెతకబోతే, గొర్రెల తాత పనితనాన్ని చూసి పరమాత్ముడే సాయంగా వచ్చి తొలికిపట్టి చెనిగిచేన్లో గడ్డి తవ్వినాడంట!'' అని చెప్పింది పెద్దింటి దీపం.

''గొర్రెలతాతా! అదేం పేరు? ఇచ్చిత్తరంగా వుండాదే!'' అనింది గుడిసింటి దీపం.

''బొడ్డుకోసి వాళ్ళమ్మా, నాయనా పెట్టిన పేరు గోపిని నారాయణస్వామి నాయుడు. ఆ పేరుకి బొడ్డుకోసి కొంతేగాలపు నాకొడుకు పెదబ్బ పెట్టిన పేరు గొర్రెలతాత. వాళ్ళకు దొడ్డెడు గొర్రెలుండేవి. గొర్రెలను మేపే తాత కాబట్టి గొర్రెలతాత అని పేరు పెట్టినాడు. ఆఖరికి ఆ పేరే ఖాయమైపాయింది''

''గొర్రెలతాత అంతపొడుగూ కాదు. అంత పొట్టీగాదు. దిట్టమైన మనిషి. కండలు తిరిగుండేవి. ఎత్తయిన ఎదమింద ఏ ఆడదాని చూపైనా పడితే వొళ్ళు మరిచిపొయ్యి చూపు తిప్పుకునేది గాదు''.

''మీసం మెలేసి చూస్తే పులైనా తోకమడిసి, కాళ్ళు చాపి కూర్చోవాల్సిందే!''

''ఆ చూపులో మెరుపులు మెరిసేవి''.

* * *

చెనిగి చెట్లు పసుప్పచ్చని పూలు పూసినాయి.

ఎండ సగించినట్టు కాస్తావుండాది.

తూర్పు చేన్లో ఈతచెట్టు ఒగటి అడ్డంగా వుంటే రంపంతో మొదులు తెగ్గోస్తా వుండారు గొర్రెలతాత, పెదబ్బవాళ్ళ నాయన.



అపొద్దు బడికి సెలవుకావడంతో పెదబ్బ గూడా వాళ్ళతోపాటూ వచ్చి గొర్రెల్ని, గొడ్లను కటవన తోలి మేపతా వుండాడు.

అది పచ్చిక కాలం.

గానుగచింతగొల్లపల్లె, చెలంపల్లె, కళ్ళావాళ్ళపల్లెల నుంచి గూడా మేపేదానికి జీవాలను ఆ కటవకే తోలుకోని వచ్చినారు.

ఆడ నరులు పుట్టినప్పుడు పుట్టిన రాగిమానొకటి వుండాది.

జీవాలను కటవన తోలి ఆ మానుకిందికి చేరతారందురూ!

గొడ్లను మేపే పిలకాయలతో ఆలగోడు బాలగోడుగా వుండాది.

పిల్లనగట్టెలు ఊదేవాళ్ళు ఊదతా వుండారు. బలిగూడు కూసేవాళ్ళు కూస్తా వుండారు. చుక్కు చుక్కు పుల్ల ఆడుకునేవాళ్ళు ఆడుకుంటా వుండారు. కోతీ కొమ్మొచ్చు ఆడేవాళ్ళు ఆ కొమ్మ మీద నుంచి ఈ కొమ్మమిందకు, ఈ కొమ్మమింద నుంచి ఆ కొమ్మమిందకు ఎగరతా, దూకతా, యాల్లాడతా వుండారు.

పెద్దోళ్ళు గోగునార తెచ్చుకోని పగ్గాలు పేనుకుంటా, ఆడోళ్ళయితే దుసార తీగలతో చుట్టకుదుర్లు అల్లుకుంటా, బీడీలు కాల్చుకుంటా, వక్కాకు నమలతా అరువులు చేసుకుంటా వుండారు.

ఆపొద్దు చెలంపల్లె నుంచి రామిరెడ్డి గారి అవ్వగూడా గొడ్లను తోలుకోని వచ్చింది. నారవాకులతో ఇస్తరాకులు కుడతా వున్నింది. పెదబ్బ ఎల్లమోళ్ళ సంపూర్ణ దెగ్గిరికి పొయ్యి కుర్చున్నాడు.

''మ్మేయ్ సంపూర్ణా! మనమిద్దరం చుక్కచుక్కపుల్ల ఆడుకుందామా?'' అని అడిగినాడు మన్నుని చెరువుకట్ట మాదిరి కుప్పతోస్తా.

''నువ్వు భలే గొబ్బునాబట్టవి! నీతో నేను ఆడనుపో!'' అని మూతిని ముడుచుకునింది.

ముక్కుమింద రోషాన్ని నిలబెట్టి,

''ఎందుకుమ్మే?'' అన్నేడు.

''పుల్ల ఎక్కడ దాచేస్తావో దాచేస్తావ్. కలబెడతానే వుంటావుగాని, పుల్లని ఎంత సేపటికీ తియ్యనే తియ్యవు. నీతో చుక్కుచుక్కు పుల్ల ఆడాలంటే యాష్టవచ్చేస్తుంది'' అని లేచిపోయింది సంపూర్ణ.

పెదబ్బ మూతి నల్లగా పెట్టుకోని రామిరెడ్డి గారి అవ్వ దెగ్గిరికి పొయినాడు.

కొంగున కట్టుకోనుండే మూటవిప్పి పేలపిండి వుంటలు ఇచ్చింది పెదబ్బకి.

సంగటేలయింది.

పెదబ్బ వాళ్ళనాయన మడికి నీళ్ళు పెట్టాలని ఇంటికి యలబారిపొయినాడు.

గొర్రెలతాత రాగిమాను కిందకొచ్చి రామిరెడ్డి గారి అవ్వపక్కన తొడని తొడకి రాసుకోని కుర్చున్నాడు.

''పిల్లోళ్ళు వుండారని సిగ్గు గూడా లేదమ్మా ముసిలోడికి. జరుగు జరుగు'' అని కసురుకునింది.

''ఏమి సిగ్గు? ముసిలోళ్ళు అయినా గూడా ఇంగా సిగ్గు'' అన్నేడు నవ్వతా జరక్కుండానే.



## మందుబాబు

ఇతని పేరు చెబితే చాలు బీరు పరారు కావాల్సిందే. షాంపెయిన్ బాటిల్ నురగ చిమ్మాల్సిందే. ఇంత మందుబాబెవర్రా బాబూ అని అనుకుంటున్నారా? అతడే ఆస్ట్రేలియా క్రికెట్ వీరుడు రిక్కీ పాంటింగ్. సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా పేరుతెచ్చుకున్న రిక్కీకి అమ్మాయిలన్నా, మందన్నా తెగ ఇష్టం. ఏడేళ్ళ క్రితం భారత్ పర్యటనకొచ్చిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడైన రిక్కీ హోటల్ గదిలో పీకల్దాకా తాగి.. అందరి రూముల దగ్గరకే వెళ్లి తెగ అల్లరి పెట్టేవాడుట. అలాగే ఢిల్లీలోని ఓ పబ్‌కెళ్లి క్యాబరే డాన్స్ సుందరీమణుల చుట్టూ డాన్సులేశాడట. విషయమేమిటని కనుక్కుంటే మందు పీకల్దాకా తాగాడని తెలిసిపోయింది. సెక్యూరిటీ వారికి రిక్కీ వ్యవహారం మరింత ఇబ్బందిగా వుండేదిట.

ఆయవ్వే కొంచెం పక్కకి జరిగింది.

నిన్న సంతలో ఆయవ్వకోసమని వక్కాకు తీసుకుని పైగుడ్డలో మూటగట్టి తెచ్చి ఇచ్చినాడు.

ఆయవ్వ గొర్రెలతాతకి మేకమార్కు బీడీకట్ట ఇచ్చింది.

నారవాకుల్లో సంగటిపెట్టి గుంత చేసుకున్నేక క్యారేజీ మూత తీసింది.

ఉలసచేపల ఇగురు వాసన గుప్పుమనింది.

పెదబ్బ పాణాలు జివ్వుమని లాగినాయి.

ఇగురులో అద్దుకుని ముద్దని నోట్లో పెట్టుకున్నాడు గొర్రెలతాత.

''అమృతాన్ని నోట్లో పెట్టుకున్నట్టుండాది. ఈ ఉలసల ఇగురు తినేదానికే ఈ జన్మెత్తినట్టుండాను'' అన్నేడు.

ఆమాటకి రామిరెడ్డి గారి అవ్వ కండ్లల్లో నీళ్లు తిరిగినాయి.

నారవాకుల్లో ఏమితిన్నా అమృతమే! రుచి నారవాకులదా? ఉలసల ఇగురుదా? తేల్చుకోవడం కష్టంగా వుండాది పెదబ్బకి.

''కూరచేసినా, సేద్దెం చేసినా, సంసారం చేసినా, లంజిరికం చేసినా, దొంగతనం చేసినా, ఏ పని చేసినా మొనుసుపెట్టి చెయ్యాలి. మొనుసు పెట్టి చేసిన పనిలో పరమాత్ముడుంటాడు'' అని చెప్పి తృప్తిగా సంగటి తిని పైకి లేచినాడు గొర్రెలతాత.

గొర్రెలతాత బీడీ తాగతా, సంగటి తిని రామిరెడ్డి గారి అవ్వ వక్కాకు వేసుకుంటా కొమ్మమింద వాలిన గువ్వల మాదిరి కొంచేపు అరువులు చేసుకున్నేరు.

మల్లా పెదబ్బ, గొర్రెలతాత ఈతచెట్టు దెగ్గిరికి వచ్చినారు.

చెరోపక్కా పిడిపట్టుకుని రంపంతో తెగ్గోస్తా వుండారు.

''మనసు పెట్టి చేసేపనిలో దేవుడుంటాడా తాతా?'' అని అడిగినాడు పెదబ్బ.

''నువ్వు ఇంగా ఆమాట మరిచిపోనేలేదా! నమ్మితే వుంటాడు. నమ్మకపోతే వుండడు పెదబ్బా. నాకు పెళ్ళయిన కొత్తల్లో ఒగ ఇచ్చిత్తరం జరిగింది'' అన్నేడు గొర్రెలతాత.

''ఏంది తాతా అది?'' అని అడిగినాడు పెదబ్బ.

''ఇప్పటి మాట కాదులే ఇది! మీ పెద్దత్త నడస్తా వున్నిందనుకుంటా, మీ నాయనేమో మీ అవ్వ కడుపులో వుండి వుంటాడు''.

ఒగరోజు ఏమైందో తెలుసునా?

నేను, మీ లచ్చుమవ్వ గుట్టల సందు గుడ్డంలో గెడ్డి తవ్వుకుంటా వుండాము. ఒగ పిలగాడు మంగళగుట్ట దిగి వచ్చినాడు.

నూనూగు పాయెం. నల్లనిఛాయ, ఎర్రని కండ్లు, గిచ్చితే పాలు గారేట్టు వుండాడు. నుదిటిమింద విభూది రేఖలు దిద్దుకున్నాడు.

వచ్చీరాగానే,

''యోవ్... ఈ చేను నీదేనా?'' అని దబాయించినట్టు అడిగినాడు.

తవ్వుకుంటా వుండే నేను తలెత్తి చూసి,

''నాదే! నువ్వెవురు?'' అని అడిగినాను.

''నాది అరవదేశం. ఇక్కడికి చానాదూరంలే! ఈదావన పోతా నీ చేను చూసినాను. నిన్ను పలకరిద్దామని ఇట్లా వచ్చినాను. ఆ గోగుపూలు సూడు. ఎంత సొగసుగా వుండాయో! ఈ కంది చేలు సూడు. ఎట్లా ఇరగ్గాసిందో? వొళ్ళంతా కండ్లేసుకుని ఆ సద్దకంకులు సూడు ఎట్లా వయ్యారంగా గాలికి తలలూపతా వుండాయో? ఆ పసలపోలిగాడు సూడు, ఆ కంకిమింద వాలి ఎట్లా ఉయ్యాలూగతా వుండాడో? అరెరే... నీ చేను సొగసును చూసేదానికి రెండు కండ్లు చాలవు. పొగిడేదానికి మాటలు చాలవు'' అన్నేడు కండ్లు ఎల్లబెట్టుకోని చేనుని చూస్తా.

''బాగుండాది సంబడం. చూసింది చాలుగాని చేనుకి దిష్టి తగులుతుంది. నరుడి కన్ను పడితే నల్ల

రాయి గూడా పగిలిపోతుంది'' అనింది మీ లచ్చు మవ్వ.

''మ్యావ్... నేను చానా రాజ్జాలు తిరిగుండాను. ఇంత చూడచక్కని చేనుని నేను ఎక్కడా చూల్లేదు. ఆ మూలస్తానమ్మ మీ చేన్లోనే కొలువు తీరి వుండాది'' అన్నేడు ఆ పిలగాడు.

''ఆయమ్మ మా ఇంటి ఆడబిడ్డే!'' అనింది మీ లచ్చుమవ్వ.

''నీ మొగుడు సేద్దిం చెయ్యడంలో భలే మొగ లాయి. సస్తే దేవుడే సొయంగా పూలరతమేసుకోని వచ్చి స్వర్గానికి తీసుకోనిపోతాడు'' అన్నేడు నవ్వతా.

''సొర్గాలు మాకెందుకు చెప్పు? ఈ మన్నులో కూరకలాడ్డమే మాకు సొర్గం. ఈ మన్నులో మరుగ వ్వడమే మాకు ఆనందం'' అన్నేను.

''మ్యావ్... ఆకలిగా వుండాది. అంత సంగటి పెడతావా?'' అని అడిగినాడు.

''ఇన్ని మాటలూ చెప్పింది సంగటికోసమా?'' అన్నేను.

''ఊరికే పెట్టొద్దులే! మీ రుణం వుంచుకోను. పొద్దుగూకేంతవరకు మీతోపాటు గడ్డి తవ్వతాను'' అన్నేడు ఆకలి తట్టుకోలేక మొగం మాడ్చుకుని.

''ఏందా ఎక్కిరింపులు మాటలు! ఆకలిమింద వుండాడు బిడ్డ, నువ్వు రా నాయనా!'' అని పలవ రేణి మాను నీడకు పిలుచుకోనిపొయ్యి కడుపు నిండా అన్నంపెట్టింది మీ లచ్చుమవ్వ.

మాతోపాటు పొద్దుగూకేంతవరకు గడ్డి తవ్వి నాడు.

ఎన్ని అరువులు చేసినాడనుకున్నావు?

ఎన్ని పద్దేలు పాడినాడనుకున్నావు?

పొద్దుగూకేటప్పుడు ఆ పలవరేణిమాను చాటుకుపొయినాడు.

అంతే,

నెమిలొగాటి పలవరేణి మానులోంచి 'రెపరెప మని పైకిలేసి మన పల్లెమిందగా ఎగిరిపోయింది.

అని చెప్పినాడు గొర్రెలతాత.

''ఇందులో ఇచ్చిత్తరం ఏముండాది తాతా?'' అని అడిగినాడు పెదబ్బ.

''ఆవచ్చింది ఎవరనుకున్నావు? సుబ్రమన్నె స్వామి. మన ఇల్లిలిపుదేవుడు'' అన్నేడు గొర్రెల తాత.

''దేవుడెక్కడైనా కనిపిస్తాడా తాతా? నువ్వు కవి గట్టి కత చెప్పినావు'' అన్నేడు పెదబ్బ.

''కనిపిస్తాడు. కష్టం చేసే వాడికి మాత్తరమే కని పిస్తాడు'' అన్నేడు గొర్రెలతాత.

* * *

ఈతచెట్టుని తెగ్గోసి కూలదోసేసినారు.

మొదులు మిగిలిపోయింది.

దాన్ని గెడ్డపారతో లోడి వేళ్ళతోసహా పెళ్ళగిస్తా వుండాడు గొర్రెలతాత.

వొళ్ళంతా చెమటలు పోసేసినాయి.

గెసపోస్తా వుండాడు.

ఇంగొక దెబ్బేస్తే మొదలు లేసిపోతుంది. గడ్డ పార పైకెత్తి బలంగా దిగేసినాడు. అది కొంచెంలో తప్పిపొయ్యి బొటనవేలిలో దిగింది. వేలు సగానికి తెగిపొయింది.

నెత్తురు జివ్వున ఎగజిమ్మింది.

పెదబ్బకి ఆ నెత్తురు చూసి కండ్లు తిరిగినంత పనయింది.

గొర్రెలతాత గెడ్డపారని పక్కన దిగేసి కూర్చు న్నాడు.

ఏమాత్తరం భయపడలేదు. ఏమాత్తరం బాధ పడలేదు.

''తాతా... నెత్తురు కారిపోతా వుండాది. ఇప్పు డెట్టా తాతా?'' అని భీతిపడిపొయినాడు పెదబ్బ.

''కారిపోనీ పెదబ్బ! నెత్తురుతో ఎంత తడిస్తే నేలంత శాంతగిస్తుంది'' అన్నేడు నవ్వతా.

''నీకు నొప్పిగా లేదా తాతా?'' అని అడిగి నాడు.

''ఇప్పుడు వుండదు పెదబ్బ నొప్పి, దెబ్బ తగి లింది గదా! నరాలు మొద్దుబారి పొయ్యి వుంటాయి. రాత్తిరిగదా వుండేది రామభజన'' అన్నేడు.

''సొయిబులపల్లెకి పోదాం పదా తాతా. బోడి డాక్టరు దెగ్గిరికి'' అన్నేడు పెదబ్బ.

''ఎందుకు చెప్పు. మీకాలంలో అయితే డాక్టర్లు. మా కాలంలో యాడున్నేరు డాక్టర్లు. ఈ దెబ్బకు మన్నేమందు'' అని చెప్పి నెత్తురు గడ్డకట్ట నిచ్చి దెబ్బకి నున్నని మన్ను మెత్తించి, పైగుడ్డ అంచు చింపి కట్టుకట్టినాడు.

''మన్నేస్తా వుండావు చీము పడుతుందేమో తాతా'' అన్నేడు పెదబ్బ.

''చీము పట్టదు. గీము పట్టదు. మనకు ఈ మన్నే తిండి. ఈ మన్నే మందు. ఈ మన్నే పుట్టుక. ఈ మన్నే చావు. పెదబ్బా... నేను ఇంట్లో పుట్టలే దంట. అద్దో... ఆ పలవరేణి మానుకింద మా యమ్మ నన్ను కనిందంట'' అని చెప్పినాడు గొర్రెల తాత.

''ఎందుకు తాత? ఇంట్లో కనకుండా చేన్లో కనింది నిన్ను'' అని అడిగినాడు.

''ఎందుకంటే ఏం చెప్పేది? నన్ను కడుపులో మోస్తానే చెనిగిచెట్లు తవ్వుకుంటా వున్నింది మాయమ్మ. నొప్పులొచ్చినాయి. ఆ పలవరేణి మానుకిందనే నీళ్ళాడింది. పడతా పడతానే మన్నులోపడి 'క్యార్‌క్యార్‌మని' కండ్లు తెరిసి నానంట. ఉమ్మనీటితో నేల చెమ్మగిల్లింది. పారేస్తే కుక్కో, నక్కో ఈడ్చుకోని పోతుందని నా మాయ పారని ఈ చేన్లోనే పూడ్చిపెట్టినారంట. రేపు నేను సచ్చిపోతే నన్ను గూడా ఈ చేన్లోనే పూడ్చిపెట్టల్ల. గుర్తుపెట్టుకో పెదబ్బా!'' అన్నేడు గొర్రెలతాత.

''నువ్వుగూడా సచ్చిపోతావా తాతా?'' అన్నేడు దిగులుపడిపోతా పెదబ్బ.

''సచ్చిపోక ఇక్కడ్నే చీలకొట్టుకోని వుంటానా? పుట్టినాక గిట్టక తప్పదుగదా! నేను సచ్చిపొయినాక దేవుడొచ్చి 'ఒరే నారాయణస్వామినాయుడు! నీకోసం నేను పూలరతమేసుకోని వచ్చినాను. సొర్గా నికి పోదాం రారా!' అని పిలిచినాడనుకో, అప్పుడు నేను ఏమంటానో తెలుసునా?''


''మూసుకోనిపో సాలుగాని! నీ సొర్గం నాకెందుకు. బెల్లాయి గువ్వనై మల్లా ఆ పలవరేణి మానులోనే గూడుకట్టుకోని ఈ చేనుని కాపెట్టు కోని వుంటాను. ఆ బిక్కిపాదల్లో కుందేలునై పుట్టి ఈ చేన్లో మొలిచిన గరికనే కొరికి కడుపు నింపు కుంటాను. ఆ సీతాకోక చిలకనై ఈ చెనిగి పూల మిందనే ఎగరతా వుంటాను. ఆ ముష్టిమానుగా పుట్టి మల్లా మడకనై ఈ చేన్లోనే కొండ్రిలేస్తా వుంటాను. ఆ ఎద్దుగా పుట్టి ఈ చేన్లోనే మడక దున్నతా వుంటాను. ఆ మబ్బునై ఈ చేనుమిందనే వాలి వాన కురిపిస్తాను. ఆ బందారి బసవన్ననై వెయ్యి కాళ్ళతో ఈ చేన్లోనే పారాడతా వుంటాను. నీ సొర్గం నాకెందుకు? నా చేనే నాకు స్వర్గం'' అంటాను అన్నేడు గొర్రెలతాత.

అని కత చెప్పింది పెద్దింటి దీపం.

''ఈ కత ఒగపోట చిక్కుబడిపొయింది. ఇంతకీ రామిరెడ్డి గారి అవ్వ ఎవురు? గొర్రెలతాతకి ఆమెకి ఏమి సమందం?'' అని అడిగింది గుడిసింటి దీపం.

''కత అంతా విని రాముడికి సీతేమైతింది? అని అడిగినట్టుండాది. లచ్చుమవ్వ బతుకును పంచుకు నింది. రామిరెడ్డి గారి అవ్వ మనసును పంచుకు నింది'' అని చెప్పి చిక్కుతీసింది పెద్దింటి దీపం.

★



## గాయాలకు మందు హారతి కర్పూరం

చిన్నపిల్లలు ఆటలు ఆడుకునేటప్పుడు ఎక్కువగా దెబ్బలు తగిలించుకుంటారు. కొన్ని గాయాలు త్వరగా మానినా మరికొన్ని నయం కాకపోగా రోజురోజుకీ పెద్దవవుతుంటాయి. గాయంనుంచి చీము, నీరు కారుతుంటుంది. ఇటువంటప్పుడు హారతి కర్పూరాన్ని పొడిచేసి నేతిలో కలిపి గాయాలపై రాస్తే త్వరగా మానిపోతాయి. కసివిందాకు, సీతాఫల ఆకు, పచ్చి పటికలను నూరి కొబ్బరి నూనెతో ఉడికించి గాయాలకు పూస్తే నొప్పి తగ్గడమే గాక త్వరగా మానుతాయి. రావిచెట్టు బెరడను ఎండబెట్టి చూర్ణం చేసి గాయంపైన వేసినా త్వరగా నయమవుతాయి. లేత మారేడు ఆకును మెత్తగా నూరి ఆ ముద్దను పుండ్లు అయిన చోట కట్టు కడితే ఏ మందులకీ తగ్గనివి కూడా తగ్గిపోతాయి.